క్లుప్తంగా

కల్వర్టులపై కాంక్రీట్ రాళ్ల ఏర్పాటు


రాజీవ్ నగర్‌లో కల్వర్టులపై కాంక్రీట్ రాళ్ల ఏర్పాటు

కొయ్యలగూడెం: రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సౌజన్యంతో దెబ్బతిన్న కల్వర్టులపై కాంక్రీట్ రాళ్లను సోమవారం ఏర్పాటు చేశారు. రాజీవ్ నగర్‌లో కొన్నిచోట్ల కల్వర్టులు అధ్వానంగా మారడంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి కూడా వీలు లేకపోవడంతో సమస్యను రిటైర్డ్ ఉపాధ్యాయుడు జాన్ డేవిడ్ గుర్తించి రూ.25 వేల ఖర్చుతో కల్వర్టులపై కాంక్రీట్ బిళ్లలు ఏర్పాటు చేయించారు. దీంతో స్థానికులు ఆయన్ను అభినందించారు.

సంకష్టహర చతుర్థి పూజలు


కోదండరామస్వామి ఆలయంలో సంకష్టహర చతుర్థి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రామచంద్రపురంలో శ్రీ కోదండరామస్వామి ఆలయంలో సోమవారం సంకష్టహర చతుర్థి పూజలు నిర్వహించారు. ఆలయంలో కొలువైన విఘ్నేశ్వరుడికి అర్చకులు మద్దూరి వంశీకృష్ణ శర్మ మండపారాధన, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకాలు, గణపతి హోమం, నీరాజనం, మంత్రపుష్పం, గోత్రనామార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు పరిమి సత్యనారాయణ (సత్తిపండు), పరిమి ధర్మరాజు, పరిమి సత్తిపండు దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రోటరీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

జంగారెడ్డిగూడెం: శ్రీ మల్లాది సీతా రామలింగేశ్వర రోటరీ కమ్యూనిటీ హాల్ నందు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా ఆదివారం నిర్వహించారు. కేఎల్ఎన్ ధనకుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో నూతన అధ్యక్ష కార్యదర్శులు పెనుమర్తి సురేష్ బాబు, సంధ్య ప్రవల్లికలచే ప్రమాణ స్వీకారం చేయించారు. రోటరీ చార్టర్ మెంబర్స్ మల్లాది సీతా రామారావు, చామర్తి శ్రీరాములు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళ కాలికి శస్త్రచికిత్స


మహిళకు శస్త్రచికిత్స చేసిన ఏరియా ఆసుపత్రి వైద్యులు

జంగారెడ్డిగూడెం: మధుమేహంతో సెప్టిక్ అయిన మహిళ కాలికి స్థానిక ఏరియా ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. పట్టణానికి చెందిన కవులూరి రామలక్ష్మి (60)కు మధుమేహ వ్యాధితో ఎడమ కాలు సెప్టిక్ అయ్యింది. సోమవారం ఆమెకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం శస్త్రచికిత్స చేసి పాడైన కాలు భాగాన్ని తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సీహెచ్ బేబి కమల మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో అన్ని సదుపాయాలు, వైద్యులు అందుబాటులో ఉన్నారని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆస్పత్రి సేవలను వినియోగించుకోవాలన్నారు. శస్త్రచికిత్సలో ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుష్మ, డాక్టర్ సునీల్, డాక్టర్ వజ్ర కిరణ్ బృందం పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరతతో విద్యార్థులకు పాఠాలు బోధించే వారు లేక వారి భవిష్యత్తు అంధకారంలో ఉందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీలు జరిగి నెలలు కావస్తున్నా ఇక్కడ టీచర్ పోస్టుల భర్తీ చేయడంలో విద్యాశాఖ మొద్దు నిద్ర ప్రదర్శిస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండలంలో ఖాళీగా ఉన్న 78 టీచర్ పోస్టులతో పాటు రెగ్యులర్ ఎంఈఓను కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఉపాధ్యక్షుడు కురాకుల బాబురావు, రవ్వా ఉంగా, రవ్వా భీమా పాల్గొన్నారు.

జ్వరాల కాలం.. జర భద్రం


ద్వారకాతిరుమలలో ప్రధాన రహదారి పక్కన మురుగుతో నిండిన డ్రెయినేజీ


పంచాయతీ పార్కు ప్రాంతంలో పారిశుద్ధ్యం పరిస్థితి ఇలా..



- పలు గ్రామాల్లో కొరవడిన పారిశుద్ధ్య నిర్వహణ
- ద్వారకాతిరుమలలో ఎటు చూసినా వరాహాల సంచారం
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు

ద్వారకాతిరుమల: వాతావరణం మార్పులు, వర్షాల కారణంగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో డ్రెయినేజీలు పొంగి పొర్లుతున్నాయి. దాంతో రహదారులపై మరుగునీరు పారుతోంది. అలాగే వరాహాల సంచారంతో పాటు, ఈగలు, దోమలు ప్రబలుతున్నాయి. ప్రధానంగా మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలో రోజురోజుకు వీటి బెడద ఎక్కువ అవుతోంది. ముందస్తుగా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ధ్వజమెత్తుతున్నారు. సీజనల్ వ్యాధులు పెరగడానికి ఇవే కారణమని కూడా అంటున్నారు.

ముందస్తు జాగ్రత్తలే రక్ష..

రోగాలు వచ్చాక బాధపడటం కంటే.. ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలా వరకు వ్యాధులను నియంత్రించవచ్చు. ప్రజల ఆరోగ్యం క్షీణించడానికి దోమలే ప్రధాన కారణం. వీటి వల్ల డెంగీ, మెదడువాపు, చికున్ గున్యా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇంటి పరిసరాల అపరిశుభ్రతతో పాటు, నీటి నిల్వలు ఉంటే దోమలు పెరిగి వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది.

పాటించాల్సిన జాగ్రత్తలు

- వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీరు తాగాలి.
- ఎప్పటికప్పుడు నీటి పాత్రలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. క్లోరినేషన్ చేసిన నీటిని వినియోగించాలి.
- భోజనానికి ముందుగానే చేతులు, కాళ్లు శుభ్రం చేసుకోవాలి.
- వ్యక్తిగత, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- మురుగు నీటి ప్రాంతాల్లో కిరోసిన్, నేఫ్తాయిల్ చల్లి దోమల లార్వాలను నాశనం చేయాలి.
- ఇంటి కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి.
- దోమ తెరలు వాడాలి.

అప్రమత్తత అవసరం

అందరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అవసరమైన జాగ్రత్తలు పాటించాలి. జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు పీహెచ్‌సీల్లో సిద్ధంగా ఉన్నాయి. అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నాం. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. జ్వరాలపై పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమ తెరలు వాడాలి.

– ప్రవీణ్ కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, ద్వారకాతిరుమల

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మెట్టమీద ఉన్న సబ్‌స్టేషన్, బైనేరు సబ్‌స్టేషన్, పేరంపేట రోడ్డు సబ్‌స్టేషన్‌ల పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించు పనులు జరుగుతున్నందున మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డు, సుబ్బారెడ్డి కాలనీ, అయ్యన్నకాలనీ, లక్ష్మీ ఆసుపత్రి ఏరియా, కొవ్వూరు రోడ్డు, బుట్టాయగూడెం రోడ్డు, హరిజనపేట, లక్ష్మీగణపతి టౌన్‌షిప్ తదితర ప్రాంతాల్లో అన్ని రకాల విద్యుత్ సర్వీసులు, మైసన్నగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాసపురం గ్రామానికి వ్యవసాయ, గృహ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంఈవోపై ఆరోపణలు

కామవరపుకోట: సంతకం కోసం ఎంఈవో లంచం డిమాండ్ చేశారని మంకినపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆరోపించారు. తన కుమారుడు గోపన్నపాలెం కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్నాడని, ఈ క్రమంలోనే ఎన్‌సీసీలో అర్హత కోసం స్థానిక మండల విద్యాశాఖాధికారి వద్దకు సంతకం కోసం వెళితే లంచం అడిగారని ఆరోపించాడు. దీనిపై ఎంఈవో సుబ్బారావును వివరణ అడగ్గా తాను సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నుంచి వచ్చిన తర్వాత డీఈవో ఆదేశాల ప్రకారం తడికలపూడిలోని పాత హర్షిత స్కూల్ టీసీలు ఇచ్చే క్రమంలో బిజీగా ఉన్నానని, ఆ సమయంలో ఓ వ్యక్తి వచ్చి సంతకం కావాలని అడిగితే కొద్దిసేపు ఆగాలని కోరానని చెప్పారు. తాను లంచం అడిగినట్టు ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలిక అదృశ్యంపై కేసు నమోదైంది. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పేరంటపేటకు చెందిన బాలిక జంగారెడ్డిగూడెంలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఈ నెల 13వ తేదీ రాత్రి బాలిక కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించగా మరుసటి రోజు తెల్లవారుజామున 4.30కు కుటుంబసభ్యులు చూడగా బాలిక కనిపించలేదు. చుట్టుపక్కలా బంధువుల ఇంటి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం బాలిక తల్లి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

టి.నరసాపురం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. బొర్రంపాలెం గ్రామానికి చెందిన షేక్ మీరా సాహెబ్ గత కొంతంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. మతిస్థిమితం సైతం సరిగా లేకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోవడంతో అతని ఆచూకీ కోసం ప్రయత్నించి చివరకు అతడి భార్య షేక్ మహబూబ్ సుభాని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు.

మందుబాబులతో అసౌకర్యం

జంగారెడ్డిగూడెం: మండలంలోని పేరంట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌సీఎం చర్చి వద్ద అసాంఘిక కార్యక్రమాలతో విశ్వాసులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆర్‌సీఎం చర్చి సమీపంలో బెల్టుషాపు ఉండటంతో మద్యం సేవించే వారు బెల్టు షాపు వద్ద మందు కొనుగోలు చేసి, ఆర్‌సీఎం చర్చి ప్రవేశ ద్వారా ఎదురుగా ఉన్న బెంచీలపై కూర్చొని మద్యం, గంజాయి సేవిస్తున్నారని విశ్వాసులు తెలిపారు. అర్ధరాత్రి వరకు మద్యం, గంజాయి సేవించి, ఆ ప్రాంతాన్ని అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారని, ఉదయాన్ని చర్చికి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటోందన్నారు. చర్చి ముఖద్వారాన్ని అడ్డుగా ఉన్న బల్లలను తొలగించాలని, రాత్రివేళ పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని సంఘస్తులు, గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని పీజీఆర్ఎస్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు డొక్కా రాజేష్, మొయ్యేటి పండు, కొత్ర ఏసు, కలపల ఏసు, మల్లిపూడి రమేష్, ప్రత్తిపాటి అనిల్, లాగు పవన్ తెలిపారు.

గ్రామసభ రహస్యంగా నిర్వహించడంపై మండిపాటు

సచివాలయం వద్ద గిరిజనుల ధర్నా


రెడ్డిగణపవరం సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజన సంఘ నాయకులు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరంలో సోమవారం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం భూసేకరణ చేపట్టేందుకు ఏర్పాటు చేసిన గ్రామసభ సరైన సమాచారం లేకుండా నిర్వహిస్తున్నారంటూ గిరిజన సంఘాల నాయకులు అధికారులను ప్రశ్నించారు. ఎవరికీ తెలియకుండా, ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గ్రామ సభ రహస్యంగా నిర్వహించడం ఏమిటని మండిపడ్డారు. సీపీఐ మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ కోర్సా జలపాలు, కారం భాస్కర్, గొడ్డా పవన్ కళ్యాణ్, తదితరులు మాట్లాడుతూ రెడ్డిగణపవరం పంచాయతీలో పోలవరం నిర్వాసితుల కోసం భూసేకరణ చేస్తున్న అధికారులు కనీసం స్థానిక పంచాయతీ పాలకవర్గానికి, సర్పంచ్, ఉపసర్పంచ్‌కు ఎటువంటి సమాచారం అందించలేదని ఆరోపించారు. అధికార పార్టీకి చెందిన ముగ్గురు వ్యక్తులకు మాత్రమే సమాచారం ఇచ్చారన్నారు. గిరిజన చట్టాలకు విరుద్ధంగా గ్రామ పెద్దల ప్రమేయం లేకుండా ఏ విధమైన సమాచారం ఇవ్వకుండా గ్రామ సభ పేరుతో భూసేకరణ చేయడం నేరమని అన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సరైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక సమయంలో అధికారులు, గిరిజన సంఘ నాయకుల మధ్య వాదోపవాదం జరిగింది. అన్యాయంగా జరిగే భూసేకరణపై అధికారులు చర్యలు తీసుకోవాలంటూ సచివాలయం ఎదుట గిరిజన సంఘ నాయకులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెట్టి వీరయ్య, ఉనుముల చంద్రం, ఉయికే శ్రీరాములు, మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం పట్టణాభివృద్ధికి కృషి


6వ వార్డులో డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: పట్టణాభివృద్ధి దిశగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు జంగారెడ్డిగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. సోమవారం పట్టణంలోని 6వ వార్డులో నిర్మిస్తున్న డ్రెయిన్ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీలో వార్డుల అభివృద్ధి దిశగా కాంట్రాక్ట్ కమిటీలో వర్కులు పెట్టడం జరిగిందన్నారు. దీనిలో భాగంగానే 6వ వార్డులో రూ.5 లక్షలతో డ్రెయిన్ నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. నాణ్యతతో పనులు జరగాలని గుత్తేదారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కౌన్సిలర్ నేకూరి కిషోర్, ఉగ్గం ప్రసాద్, మునిసిపల్ ఏఈ, నాయకులు బత్తిన చిన్న, నేట్రు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన


వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన దృశ్యం

కొయ్యలగూడెం: కుంతలగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఎంపీపీ గంజిమాల రామారావు సోమవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ పులి నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రూ.8 లక్షలతో చేపట్టే నిర్మాణ పనులు అగస్టు 15వ తేదీ నాటికి పూర్తి చేయనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళి తెలిపారు. గ్రామాన్ని వరద నీరు ముంచెత్తుతుందని గ్రామ నాయకులు గెడా సూర్యప్రకాష్, కన్నాబత్తుల బాలస్వామి, ఎంపీపీ దృష్టికి తీసుకురాగా రూ.3 లక్షలతో డ్రెయిన్ నిర్మాణానికి అంగీకారం తెలిపారు. అనంతరం గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్‌ను పరిశీలించి డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం విద్యార్థులతో కలిసి రుచి చూశారు. పాఠశాలకు మంజూరైన వాటర్ ప్లాంట్ అమర్చటానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గంగాధర్, మాజీ వైస్ ప్రెసిడెంట్ భూషయ్య, టీఎస్ స్నేహన్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు

కామవరపుకోట: కృష్ణాజిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని జెడ్పీటీసీ కడిమి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వైఎస్సార్ సీపీ నాయకులే టార్గెట్‌గా కూటమి నాయకులు దాడులు చేస్తున్నారన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళపై పట్టపగలు నడిరోడ్డుపై కూటమి నాయకులు దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. జిల్లా ప్రథమ పౌరురాలికే రక్షణ కల్పించలేని ప్రభుత్వం సామాన్య మహిళలకు ఏ విధంగా రక్షణ కల్పిస్తుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, మాజీ సొసైటీ చైర్మన్ సాయిన కనకరాజు, ఎంపీటీసీలు బొల్లు వెంకట సత్యనారాయణ, పోలిమెట్ల ప్రశాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు వేముల సాయిబాబు, మేడంకి చిన్న, ఎస్కే కరిముల్లా, ఆకుల అప్పారావు, చిక్కాళ్ళ శ్రీనివాసరావు, మోహన్, పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’కు ఎగనామం

కుక్కునూరు: కూలి పనులకు వెళ్లే ఓ మహిళకు కారు ఉందని సాకు చూపి తల్లికి వందనం పథకానికి ఎగనామం పెట్టింది కూటమి ప్రభుత్వం. వివరాలు ఇలా ఉన్నాయి, కుక్కునూరు గ్రామానికి చెందిన పరిటాల నాగమణికి ఇద్దరు సంతానం. వారిద్దరూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9,7 వ తరగతులు చదువుతున్నారు. ప్రభుత్వం ఇటీవల తల్లుల ఖాతాల్లో జమచేసిన తల్లికి వందనం సొమ్ము రూ13 వేలు ఆమె ఖాతాలో జమకాలేదు. ఈ విషయమై నాగమణి గ్రీవెన్స్‌లో దరఖాస్తు సమర్పించినా ఫలితం లేదు. దీంతో సోమవారం సచివాలయానికి వెళ్లి ఆరా తీయగా నాగమణి నల్లకుంట గ్రామంలో ఉంటున్నట్టు హౌస్ హోల్డ్ డేటాలో పేర్కొనడంతో పాటు ఆమెకు కారు ఉన్నట్టు నమోదు చేయడంపై ఖంగుతింది. కూలి పనులకు వెళ్లే తమకు కారు కొనుక్కునే స్థోమత ఎక్కడిదని వాపోయింది. ఈ విషయమై అధికారులు తనకు న్యాయం చేయాలని వేడుకొంది.

అక్రమ భూ బదలాయింపులపై చర్యలు తీసుకోండి

ద్వారకాతిరుమల: మండలంలోని కొమ్మర గ్రామంలో అసైన్డ్ భూములను అక్రమంగా బదలాయిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల పలువురు గ్రామస్తులు అసైన్డ్ భూములను కొందరు రెవెన్యూ అధికారులు చట్టవిరుద్ధంగా మారుస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అసైన్డ్ భూముల అక్రమ బదలాయింపుల ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిపి, సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని, బాధిత ప్రజలకు న్యాయం చేయాలని సోమవారం కలెక్టర్‌ను లిఖిత పూర్వకంగా కోరారు.

పోలింగ్ స్టేషన్ రేషనలైజేషన్‌పై సమావేశం


సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్

పోలవరం రూరల్: పోలింగ్ స్టేషన్ రేషనలైజేషన్‌పై అన్ని పార్టీల మండల స్థాయి నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ఆర్ఎస్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రేషనలైజేషన్‌పై చర్చించారు. మండలంలో 40 పోలింగ్ కేంద్రాల్లో 1200 కంటే ఎక్కువ ఓటర్లు గల పోలింగ్ కేంద్రాలు నాలుగు ఉన్నాయన్నారు. ఎల్ఎన్‌డీపేటలో 254, 255 , పోలవరం 262, పట్టిసీమ 275 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ కేంద్రాలను రెండుగా విడదీసి ఆగ్జలరీ కేంద్రంగా పక్క రూమ్‌లలో పోలింగ్ కేంద్రాలు నిర్వహించేందుకు అనుకూలంగా ఉన్నాయని, కనీస సదుపాయాలు కూడా ఉన్నాయని తహసీల్దార్ తెలిపారు. సమావేశంలో ఎపిక్ డీటీ ఎస్.జయశ్రీ, సూపరింటెండెంట్ కేయు శ్రీనివాస్, రాజకీయ పార్టీల మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


జంగారెడ్డిగూడెం సీఐ ఎంవీ సుభాష్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పోలీస్ సర్కిల్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎంవీ సుభాష్ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో శాంతిభద్రల మెరుగుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతంగా కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా పట్టణంలో గంజాయి అమ్మకం, రవాణా, సేవించడం వంటి కార్యకలాపాలపై నిఘా పెట్టినట్లు చెప్పారు. కోడిపందేలు, పేకాట, బెట్టింగ్ వంటి జూదక్రీడలపై కఠినంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. ఎవరైనా ఈ కార్యకలాపాలు నిర్వహించినట్లు తెలిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు, అవసరమైతే రౌడీషీట్ కూడా తెరుస్తామన్నారు. ఇక మద్యం సేవించే వారు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధమని గుర్తుంచుకోవాలన్నారు. ఈ నియమాన్ని విస్మరించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే జరిమానాలతో పాటు శిక్షలు కూడా అనుభవించాల్సి ఉంటుందన్నారు.

ట్రాఫిక్‌పై ప్రత్యేక శ్రద్ధ

పట్టణం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ట్రాఫిక్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు సీఐ ఎంవీ సుభాష్ తెలిపారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జంగారెడ్డిగూడెంకు నిరంతరం వస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వలన ట్రాఫిక్ అంతరాయాలు ఉండవాన్నరు. నిబంధనలు ఉల్లంఘనకు పాల్పడితే తొలుత జరిమానాలు, ఆపై చట్టప్రకారం శిక్షలు ఉంటాయన్నారు. అలాగే పట్టణంలో శాంతిభద్రల కోసం హై రెజల్యూషన్‌తో కూడిన సీసీ కెమేరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే డ్రోన్ వ్యవస్థ సైతం ఏర్పాటైందని, రాత్రి సమయాల్లో డ్రోన్‌తో పట్టణాన్ని నిఘాలో ఉంచుతున్నట్లు తెలిపారు. ఇక, పట్టణంలో వ్యభిచార గృహాలు నిర్వహించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీఐ సుభాష్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు, నిర్వాహకులకు కౌన్సిలింగ్ నిర్వహించినట్లు చెప్పారు.

ప్రజల శ్రేయస్సు కోసం కృషి చేయడమే భక్తి మార్గం

గాడాల క్షేత్ర పీఠాధిపతి


దేవస్థానం ఏఈఓ రమణరాజును సత్కరిస్తున్న గాడాల క్షేత్ర పీఠాధిపతి

ద్వారకాతిరుమల: సమాజంలో సేవాభావం కలిగి, ప్రజల శ్రేయస్సు కోసం నిస్వార్థంగా కృషి చేయడమే నిజమైన భక్తి మార్గమని చిన్నవేంకన్న స్వామివారి పీఠం (గాడాల క్షేత్ర) పీఠాధిపతి శ్రీమాన్ చిన్నవెంకన్నబాబు స్వామీజీ అన్నారు. శ్రీవారి క్షేత్రాన్ని సోమవారం స్వామీజీ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఇటీవల దేవస్థానం ఏఈఓగా పదోన్నతి పొందిన అయినంపూడి రమణరాజుని స్వామీజీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఏఈఓ రమణరాజు భక్తి భావంతో అందిస్తున్న సేవలు అందరికీ ఆదర్శమన్నారు. ఆయన మరింత ఉన్నత స్థానానికి చేరుకుంటారని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గాడాల ఆలయ ట్రస్ట్ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, ఆధ్యాత్మికవేత్త, ట్రస్ట్ సభ్యులు జీవీవీ ప్రసాద్ తదితరులున్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడులో అనాథ శవానికి మానవత సంస్థ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. గెల్లా సత్తెమ్మ అనే మహిళ సోమవారం మృతి చెందింది. ఆమెకు ఎవరూ లేకపోవడంతో మానవత సంస్థ సభ్యులు గ్రామానికి చేరుకుని ఆమెకు దహన సంస్కారాలు నిర్వహించారు. కాకర్ల బుజ్జి రూ.5 వేలు, గెడ సుబ్బారావు రూ.2 వేలు దహన సంస్కారాలకు అందజేశారు. మానవత గౌరవ అధ్యక్షుడు బొమ్మ రామ్ మోహనరావు సెక్రటరీ తిరిగిపల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.